
# ఊరకుక్కలు

శ్రీ భాగవతుల రామారావ్





ఎవరో అమ్మాయిని శివయ్య లేవదీసుకు పోయాడని ఒక్కమారు గుప్పుమంది తెల్లారేసరికి ఊరంతా!

అసలు అమ్మాయి కాదు, ఎవరో 'తల్లబోడి' ట! 'ఎవరో ఏంటి? తాయారు లేదూ, మూడేళ్లాయి ముండమోపిన రండ? దాన్నే! కలిమాయ!' అన్నారు ఒక్కగుక్కని మాకర్ణంగారు పక్కింటి కులకర్ణితో దంజాలాడుకుంటూ.

'అదేంటండీ? తాయారెక్కడ కక్కపోవటమేంటి?- కమలేసాచారి కడగొట్టు సంతానం లేదూ, తలచెడ్డ తాయారూ! బొట్టు తప్పిస్తే విధవో సధవో తెలీకుండా కిల్లుగా తయారై వీధులంట పోర విరుచుకొని తిరుగుతుంటే మైలురాయి,!' అజే అట్టు ముట్టు అనవాళ్ళన్నీ అప్పజెప్పారు అల్లప రాజుగారుతోటి అయ్యవారితో, పనిగాపిల్చి

'చెప్తే నమ్మవు కాని, నే కళ్లారా చూశాను! అర్ధరాత్రి చెంబట్టుకని లేచాను. అసలూ రంకుతనం, దొంగతనం దాగుతుందిటో? వాళ్ళ కర్మంగాలి నాకళ్లపడాలి! ఆ ముండ ముందూ, ఆ వెధవ వెనకా నాళంవారి సందులో దూరేరు. చూడగానే అనుమానించాను ఇద్దరూ రాత్రికి రాత్రి ఎక్కడికో ఉడాయిం చేస్తున్నారని!' దల్లగా ఊదేసింది నీలాటి రేవులో చిచింద్రీరత్నం.

'విన్నావో! రామ! రామ! ఆ వెధవ తాయారు కంటె సహస్రాంతం చిన్నవాడట!! ఎక్కడైనా ఉంది ఇంత విడ్డూరం?' అన్నారు అచ్చియ్యమ్మగారు ఒత్తులేస్తూ, వల్లిస్తున్న గోవిందనామాలు మరిచిపోయి సుభద్రమ్మతో.

'ఈ సంగతి విన్నారత్తా? అప్పుడే తాయారు రెండుమార్లు కడుపుల్దించుకుందిట!!!' అంటోంది అత్తగారితో నే ఒకొత్త కోడలు.

'నాకు మొదటే అనుమానం వేసిందమ్మండి చెప్పకేం? చూశారా. ముండమోసిన ఈ మూడేళ్ళలో వేలం వుడిచి చెప్పటానికైనా ఒక్కమారు మూణ్ణాళ్లపాటు మూల, కూచో లేదంటే నమ్మండీ గిరమెుృదినా!! అప్పుడే అనుకున్నా 'చాటుమాటున కక్కుర్తి పడిందిరా!' అని—' అని లక్ష్మీంబాయమ్మగారి బుల్లెటిన్.

నీలాటి రేవులో నీళ్ళమనిషి సుభద్రమ్మ దగ్గిర్నుంచి చైర్ మన్ 'చెలమయ్యగారి వరకూ ఇవే కబుర్లు ఊరంతా అట్టుడికిపోతోంది. రచ్చరాయిలో నేటి చర్చనీయాంశం ఈ లేచి పోవటం గురించే.

తిలో విషయం చాలేస్తుంటే ఇంతలో 'ఇంతకీ ఎవరా కక్కుర్తి పడత?' అన్నదో గంభీరస్వరం, కొత్తో చ్చా కు మొదలెట్టన్నట్టు. సభికులందరి దృష్టి అటు మరిలేసరికి,' అరి వీడి దుంపతెగా! వాడే!! ఆ శివయ్యగాడే!!!' అన్నారు.

మొహా మొహాలు చూసుకోవటం మొదలెట్టారు. ఇహా రచ్చతాతి సభికులంతా!

'అఁహాహా!... నువ్వు... నువ్వేనా ...ఆ వెధవముండ... తాయార్ని రాత్రి లేవదీసుకు పోయావట.' అన్నదో కుక్కకంఠం తిగులు వెగులుగా యూక వెనకనుంచి.

'ఎవరికా పోయేకాలం? నీపెళ్లాం లేచిపోయిందా కక్కగట్టా! ఎవడ్రా నన్ను లేవదీసుకుపోయే మొగాడూ? ఎన్ని గుండెలుండాల్రా వాడికి? రమ్మనండి ఏ కొమ్ములొచ్చిన మొగాడొస్తాడో నన్ను లేవదీసుకు పోవడానికి!?... అరి వీళ్ళ జిహ్వపడ! తిన్నగా తినుండలేక ఎంత లేని వాదులు వేస్తున్నారు! వీళ్ల పెళ్లాలు ముండమొయ్య! వీళ్ళ కొంపల్లో పీనుగు పోనూ...' కట్టలు తెగిన ప్రవాహంతో కదిలేస్తోం దమాంతంగా ఊడిపడ్డ తాయారు!! చెరువునుంచి నీళ్లు తెస్తూ రచ్చరాయి దగ్గిర చిచ్చు చెరిగింది.

బస్! 'అరే!' అంటే 'అరె!'...మళ్లీ ఆవిడ ఊపిరి తీసుకునే లోపల రచ్చరాయి ఖాళీ అయిపోయింది. చంకలో నీళ్ళ బిందె, కడిబట్టతో తాయారూ, ఎదురుగ్గా శివయ్య తప్ప!

రాత్రి ఆమె నతను లేవదీసుకుపోయాట్ట; అతనితో ఆమె లేచిపోయిందిట. ఆ ఇద్దరే ఉన్నారక్కడ!

'విన్నారండీ? రాత్రి మీరు నన్ను లేవదీసుకు పోయారట! వీళ్ళ జిహ్వపాక్క! ఎందుకు పుట్టింది వీళ్ళకీ ఉప్పన్న బుద్ధి?' — తాయారే కదిపింది, హద్దు మీరిన కోపంతో ఆపసోపాలు పడుతూ.

'వెధవలు! లేకపోతే రాత్రి మీరు నాతో లేచిపోయారట! రామ! రామ!"


నపుంసకతైలం

అంగ నరములు బలహీనత చెంది చిన్నదైన, తిర్గి యధాప్రకారమై పూర్తి సౌఖ్య మనుభవించుటకు 45 యేండ్ల ప్రఖ్యాతి చెందినది.

1 సీసా రూ. 10/కల్దార్ వి. పి. రూ 1-0-0.
ఆర్డరుతో రు 1/- పంపవలెను.

డా॥ రత్నం సన్స్ మెడికల్ హాల్
మలకపేట బిల్డింగ్స్,
హైదరాబాడ్, దక్కన్.

అప్పజెప్పాడు శివయ్య ఆవే మాటలు.

'పళ్లు రాలగొట్టలేక పోయారూ పట్టుగుని ఒక్కొక్క వెధవనీ. వాళ్ళ పెళ్లాలు ఎంగిలి పడటం పరిపాటు కాబోలు. అందుకే అందరిమీదా అలాంటి అనుమానాలే వాళ్ళకి'

'ముమ్మాటికీ! ఉన్నమాటన్నారు. అసలు ఆ చిచ్చింద్రీ రత్నవే పుట్టించుంటుంది ఇదంతా. నేనప్పుడే అనుకున్నా'–

'ఏంటి? సోంబుగతి మూడో పెళ్లి ముదుపెళ్లాం రత్నంపనా! వారాలబ్బాయితో వరస కలుపుకున్న, ఇంతోటి సొంపుకీ దాని కెందుకు పుట్టిందీ పోయే కాలబ్బుద్ధి?'

'అఁహా చాల కాలమాయి నా కాళ్లా వేళ్లా పడుతోంది లెండి. కాని వాళ్లు బతి దిగిపోయారని మనంకూడా దిగనారుతాం టండీ? మొన్న సందెవేళ పనుండి సోంబూత కోసం ఇంటికి పోతే, ఆయన ఇంట్లో లేకపోవటం చిక్కబట్టి చెయ్యి పట్టుకుందండీ! కామినీ భూతాన్ని విదిలించుకొని వీధిలోపడేసరికి నాతల ప్రాణం తోక్కొచ్చిందంటే నమ్మండి. ఇంతకీ అప్పుడావిడే మందనుకున్నారు—'పిరికి వెధవ! అవినీతట! చూపిస్తా ఏడి బండారం అందరికీ ...'

'ఇంకేం? దానిపనే ఇదంతా? దాని తాడుతెగ! మద్దిని నేనేం అపకారం చేశానండీ దానికి?... అన్నట్టు, ఔను స్మండీ!... మొన్నా అడి వారాలబ్బాయితో సరస మాడుతున్నప్పుడు నాకళ్ళ పడ్డది! దొరికి పోయిందని కసి కాబోలు నామీద. అయినా నోటికి ఉచ్చం నీచం ఉండొద్దూ?'

'అనుకో నిద్దురూ. అందుకనే లోకులు కాకులన్నారు. ఏనుగు వెనకాల ఊర కుక్క లెంత అరిచి ఏడిస్తేమాత్రం ఏనుక్కి లక్ష్యమా ఏంటి?... పదండి, పోదాం!'

ఇద్దరూ ఇంటిముఖం పట్టారు. వీధిచివర ఎదురెదురు ఇళ్లు వాళ్లవి. తడిబట్ట పరపర మంటో నడుస్తోందామె ముందూ, అతడు వెనకా, దారి పొడవునా శివయ్య కళ్లు తడిబట్టలోని తాయారు 'మడి' మీదే ఉన్నయ్!

వీధిచివర ఆ పక్క ఇంట్లోకి ఆవిడా, ఈ పక్క ఇంట్లోకి ఈయనా పోయారు. పోతూ పోతూ ఎందుకో ఇద్దరూ వెనక్కి తిరిగి చూసుకున్నారొకర్నొకరు! అతణ్ణి చూసి ఆమె నవ్వింది! ఆమె నవ్విందని అతడు నవ్వాడు!

*   *   *   *

'ఆచారిగారున్నారండీ!' అంటూ లోపలి కొచ్చాడు దీపాలవేళ శివయ్య. తనకి తెలుసు కచ్చితంగా ఆచారిగారు ఊళ్లోనే లేరని.

వంటింట్లోంచే 'వచ్చే' అని కేకవేసి రానేఒచ్చింది తాయారమ్మ పొత్తిమంచి సర్దుకుంటూ తీరా శివయ్యని చూసి సంభ్రమాశ్చర్యాలతో తెల్లబోయి 'మీరా!... రండి! రండి!' అంది కంగారు కనపడనీయకుండా. నిజానికి తనకి అతని వేపే చూడాలనున్నా, కష్టంమీద దృష్టి నేలకి ఆన్చింది సిగ్గు కురుస్తూ.

'నాన్నగారున్నారేమో అని' అందుకున్నాడు శివయ్య, ఆమెను నఖశిఖ పర్యంతం కళ్లతో క్రాస్ ఎగ్జామిన్ చేస్తూ.

'లేరండీ. ఉదయమే ఉత్తరావిల్లి శిస్తు వసూళ్ళకని బయల్దేరారు. దివాణం నౌఖరీ మరి. నెలకి పట్టున పదిహేనురోజుల పాటు ఇంటిపట్టున ఉండరుకదా! ఏం ఉద్యోగమో ముసిలికాలంలో'

'ఏంచేస్తావమ్మా. తలమ్ముకున్నాక తంటాలు పడాలి. పోనీ, కులాసాగా ఉన్నారుకద?

'ఏం కులాసా? ఏదో తింటున్నాం తిరుగుతున్నాం తప్ప...' ముఖం విచారంగా పెట్టి.

'...అవును పాపం! ఏంటో, మీనాన్నగారంతకం లేనూ! ఆమాత్రం ఇంట్లోవాల్ల విషయమే పట్టించుకోపోతే ఎల్లా అండీ!'

'చీమూ నెత్తురూ చిక్కగా ఉన్న మీకు దాంట్లో కష్టసుఖాలు తెలుసు కాబట్టి మీరామాత్రం సానుభూతి చూపిస్తున్నారు నామీద. మానాన్నగారికేం? అన్నీ అనుభవించి కీళ్లు జారిన వారు. ఇంతకీ ఎద్దు పుండు కాకికేం నొప్పా చెప్పండీ?'

'ఔనులెండి' నిజం చెప్తున్నా, మీరు నమ్ముతారో నమ్మరో కాని రాత్రులు ఒక్కణ్ణే మీవిషయం ఆలోచిస్తున్న కొద్దీ నా గుండెలు చెరువై పోతున్నాయంటే నమ్మండి! మీ యవ్వనం ఇలా వనంలో వెన్నెలై పోతూంటే దగ్గరే ఉండి చూస్తూ ఊరుకోవటమా అని ఒకటేబాధ!'

"అయ్యో పాపం! మీ హృదయం నవనీతం మరి, లేకపోతే దిక్కూ దివాణం లేకుండా మూల పడున్న ముండ గొడవెవరికొక్కవాలి? నేనెలా చస్తే ఎవరేడవాలి?' —కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

'అబ్బా! మీరలా ఏడిస్తే నే భరించలేనుస్మండీ!' పోనీ... మీకే ఏదో దారి చూసుగోకూడదూ అంటూ!'

'ఆఁ! ఒక్కటేదారి, గోదారి!'

'తప్పు! తప్పు! అభిలాషే ఉండాలి కాని అవకాశం ఉండక పోతుందిటండీ?'

'ఆమాటకొస్తే అభిలాషుండని దెవత్తి చెప్పండీ? కోరికలున్నమాత్రాన కొనసాగిపోతే ఇంకేం?'

'కాని కృషంటూ ఒకటుంది కదండీ? ఆ పైనా 'లలాటరేఖా నపునః ప్రయాతీ?'

'సరే! ఇంతకీ మీకే సెలవియ్యకూడదూ అదేదో—' ఎందుకో తృళ్లిపడి నాలిక్కరుచుకుంది తీరా అనేశాక.

'సెలవియ్యటానికే ముందిలెండి. ఎన్నాళ్ళిలా గూళ్లల్లో మగ్గిపోతారు?... స్వేచ్ఛ కోసం అదును పట్టి రెక్కలు కదిలించ మంటూ...'

'ఖరారే అంటారా?' ఆశ తొంగిచూసిందామెలో.

'తాయారమ్మ తయారంటే మనది ఖరార్! తిరుగులే! చేతిలో చెయ్యేసి చెప్తున్నా'

...చెయ్యీ చెయ్యీ కలుసుకున్నయ్!

'మరోనాడు—కాదు, మర్నాడు!—రచ్చరాయి దగ్గిర మళ్లా రణగొణ ధ్వని! నాడు నీలాటి రేవులో పుట్టిన నీలాపనింద రచ్చరాతి చర్చలో రచ్చకెక్కి, నేడు నిక్కచ్చిగా నిజమయి ఊరుకుంది— ఏమరి ఉన్న కుక్కల్ని ఉసి గలిపాక ఊరుకుంటాయా?

★


రాజా బ్రాండ్ బంగారు కవరింగ్

ఆభరణములు

కలరు 10॥ సం॥ గ్యారంటి




రెండు, వాడం, కాపి చంద్రహారములు 2స యించి, పేట 1-కి రు. 11/- సాదా నల్లపూల4 చైను 18 యించి 1-కి రు. 5/- ఫ్లవర్ నల్లపూసల చైను 18" యించి 1-కి రు. 7/8/- ఆర్డరుతో 800 డిజైనులుగల క్యాటలాగుపంపబడును ప్యాకింగు పోస్టేజి రు. 1-0-0 అదనము.

రాజాగోల్డు కవరింగ్ కంపెనీ; (రిజిష్టర్డు)
రాజాబిల్డింగ్సు, మచిలీపట్నం.